ఎవరి ముఖం చూపించి ఓట్లు అడగాలి?

కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల్లో అయోమయం

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): 'ప్రజల్లోకి వెళ్లండి. ప్రచారం చేయండి. అని చెప్తున్నారు. కానీ, అభ్యర్థి ఎవరో చెప్పరు. ఎవరి కోసం ప్రచారం చేయాలి?' ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల నుంచి వ్యక్తమవుతున్న ప్రశ్న ఇదే. బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటికే మొదటి విడత ప్రచారం పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలను చూసి తమకు ఓటేయాలని ప్రజలను కోరుతున్నారు. ఇంతకుమించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ఆదివారం ప్రకటించనున్న మ్యానిఫెస్టోలో వెల్లడిస్తారని చెప్తున్నారు. కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం కట్టబెట్టాలని ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా డీలా పడ్డాయి. తమ నియోకవర్గం టికెట్ ఎవరికి వస్తుందో తెలియక కాంగ్రెస్ కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. ఆ పార్టీకి అనేకచోట్ల గట్టి అభ్యర్థులు లేరు. అయినా ఉన్న నేతలే టికెట్ కోసం కొట్లాడుకుంటున్నారు.

బీజేపీ మరీ దయనీయం

బీజేపీ పరిస్థితి మరీ దయనీయంగా ఉన్నది. పోటీకి అభ్యర్థులే లేని పరిస్థితి. ఎవరి ముఖం చూపించి ఓట్లు అడగాలో అర్థం కావడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. మోదీ పేరు చెప్పి ఓటేయాలని అడగాలంటే నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెక్కిరిస్తున్నాయి. మోదీని ప్రధానిగా ఉంటారా? తెలంగాణకు వస్తారా? అని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారని కార్యకర్తలు వాపోతున్నారు. ఎన్నికలకు 45 రోజులు మాత్రమే ఉన్నాయని, ఇంత తక్కువ టైంలో అభ్యర్థులు, మ్యానిఫెస్టోను ఎప్పుడు ప్రకటిస్తారు? ఎప్పుడు ప్రచారం మొదలు పెట్టాలో! తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటక గ్యారెంటీలు.. కాంగ్రెస్ చేతిలో ఖతం!

150 రోజుల్లో కర్ణాటకను ఆగమాగం చేసిన హస్తం
ఐదు నెలలైనా అమలుకు నోచుకోని ఐదు హామీలు
'గృహజ్యోతి'కి గ్రహపాట్లు, ఉత్తనిధిగా 'యువనిధి'
పైసలివ్వని 'గృహలక్ష్మి', శక్తిహీనంగా మారిన 'శక్తి'
అతిగతీ లేని 'అన్నభాగ్య'.. స్కీమ్‌లన్నీ అట్టర్‌ఫ్లాప్
సవాలక్ష కొర్రీలతో పేదల ఉసురుతీస్తున్న సర్కారు
కరెంటు కోతలతో సామాన్యులకు ఎడతెగని కష్టాలు
సాగుకు విద్యుత్తు కట్.. అన్నదాతల బలవన్మరణాలు
ట్రాఫిక్‌తో నరకప్రాయంగా మారిన బెంగళూరు సిటీ
'50 శాతం కమీషన్'తో అవినీతికి కేరాఫ్‌గా కర్ణాటక

68 ఏండ్ల కిందట ఏర్పడిన కర్ణాటకను.. కేవలం 150 రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ ఖతం చేసేసింది. ఎన్నికల సమయంలో '5 గ్యారెంటీ స్కీమ్'లతో అరచేతిలో స్వర్గం చూపించిన ఆ పార్టీ.. ఐదు నెలల్లోనే కన్నడిగులకు నరకమంటే ఏంటో చూపిస్తున్నది. 5 గ్యారెంటీ పథకాలను అమలుచేసేందుకు అప్పటికే ఉన్న పథకాలకు మంగళంపాడిన హస్తం.. కొత్త గ్యారెంటీలనూ అటకెక్కించేసింది. 'గృహజ్యోతి' పథకం కింద పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని చెప్పి.. అసలు కరెంటే ఇవ్వకుండా ఎడాపెడా కోతలకు పాల్పడుతున్నది. మహిళలకు నెలకు రూ.2 వేలు ఇవ్వాల్సిన గృహలక్ష్మి పథకాన్ని నిధులు లేక నిలిపేసింది. బియ్యం దొరకటంలేదని రైస్‌కు బదులు డబ్బులు ఇస్తామన్నది. తీరా కిలో బియ్యానికి రూ.9 చొప్పున లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తున్నది. అదీ కొంతమందికే. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఖజానాకు పెనుభారంగా మారడంతో బస్సు సర్వీసులను తగ్గించింది. భారాన్ని తగ్గించుకోడానికి మహిళల వయసు పరిమితిలో కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇచ్చే యువనిధి పథకాన్ని ప్రారంభించనేలేదు. అంతేకాదు.. కరెంటు కోతలు, తాగు, సాగునీటికి కటకట, బెంగళూరులో ట్రాఫిక్, సర్కారులో అంతకంతకూ పెరిగిపోయిన అవినీతి.. వెరసి కాంగ్రెస్‌పాలనలో యావత్తు కర్ణాటకే 'హస్త'వ్యస్తంగా మారిపోయింది



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): మొగులు జూసి కుండలో నీళ్లు ఒలకబోసుకొన్నట్టు.. పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది కర్ణాటక ప్రజల పరిస్థితి. ఎన్నికల సమయంలో '5 గ్యారెంటీ స్కీమ్'లను చూసి కాంగ్రెస్‌ను గెలిపించిన కన్నడిగులకు ఆపార్టీ చుక్కలు చూపిస్తున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చట్లేదని, గృహలక్ష్మి స్కీమ్ కింద ఇస్తామన్న రూ.2000ను ఎందుకు ఇవ్వట్లేదని ఏకంగా సీఎం సిద్ధరామయ్యనే పదుల సంఖ్యలో మహిళలు నిలదీశారంటే హామీల అమలులో కాంగ్రెస్ చిత్తశుద్ధి ఏమిటో అర్థంచేసుకోవచ్చు.

'గృహజ్యోతి'కి గ్రహపాట్లు

ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామన్న కాంగ్రెస్.. విద్యుత్తు కోతలు పెడుతున్నది. ప్రచారం కోసం కొన్ని ఇండ్లకు ఉచిత కరెంటు అన్న సర్కారు.. ఇప్పుడు అధిక బిల్లులతో వాత పెడుతున్నది. దీంతో ఇలాంటి 'గృహజ్యోతి' పథకం వద్దేవద్దంటూ సామాన్యులు లబోదిబోమంటున్నారు.

అభాగ్యంగా 'అన్నభాగ్య'

బియ్యం దొరకటంలేదంటూ స్కీమ్ ప్రారంభంలోనే ప్రభుత్వం గగ్గోలు పెట్టింది. 10 కిలోల బియ్యానికి బదులు డబ్బులు ఇస్తామని ప్రకటించి అంతలోనే మెలికపెట్టింది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిన బియ్యానికి కిలోకు ఎంత ధర ఉండేదో అంతే ఇస్తామని చెప్పింది. నెలకు ఒక్కో లబ్ధిదారుడికి కిలో బియ్యానికి రూ.9 చొప్పున జమ చేసింది. అదీ పూర్తిగాకాదు.

శక్తి కోల్పోయిన 'శక్తి'

శక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతో కర్ణాటక ఆర్టీసీ దివాళా తీసే పరిస్థితికి వచ్చింది. డీజిల్‌కు కూడా డబ్బు లేక అనేక మార్గాల్లో బస్సులను నడపడాన్ని సర్కారు నిలిపేసింది. మహిళలందరికీ ఉచిత ప్రయాణమని చెప్పి ఇప్పుడు వయసులవారీగా మాత్రమే ఫ్రీ అంటూ కొత్త కొర్రీలకు తెరతీసింది.

వెలగని 'గృహజ్యోతి'

అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటిలో మహిళా పెద్ద బ్యాంకు ఖాతాలో నెలకు రూ.2 వేల చొప్పున జమ చేస్తామన్న కాంగ్రెస్.. ఇప్పటికీ ఆ హామీని నిలబెట్టుకోలేదు. కొందరికి.. అదీ ఒక్క నెల మాత్రమే చెల్లించింది. మాటతప్పిన కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన పలువురు మహిళలు సీఎం సిద్ధరామయ్యతోనే వాగ్వాదానికి దిగడం సంచలనంగా మారింది.

ఉత్తనిధిగా మారిన యువనిధి

డిగ్రీ పాసైన యువతకు నెలకు 3 వేలు, డిప్లొమా చేసినవారికి రూ.1500 భృతిగా చెల్లిస్తామన్న పార్టీ, ఆ హామీని పక్కనబెట్టింది. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నది. కాంగ్రెస్ మోసాన్ని గ్రహించిన నిరుద్యోగులు నిరసనలు తెలుపుతున్నారు.

కరెంటు కోతలతో సతమతం

కాంగ్రెస్‌పాలనలో కన్నడనాట చీకట్లు అలుముకొంటున్నాయి. రాష్ట్ర రాజధాని బెంగళూరులోనే రోజుకు ఐదారు గంటలపాటు విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. ఉత్తర కర్ణాటకలో విద్యుత్తు కోతల సమస్య అంతా ఇంతా కాదు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే అనధికార కోతలు ఆరేడు గంటలపాటు విధిస్తున్నట్టు సమాచారం. అక్టోబర్‌లో ఉష్ణోగ్రతలు పెరుగడంతో 1,500 మెగావాట్ల నుంచి 2,000 మెగావాట్ల వరకూ లోటువిద్యుత్తు ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. ఒకవైపు విద్యుత్తు కోతలు, మరోవైపు చార్జీల పెంపుతో సామాన్యులతోపాటు పారిశ్రామిక వర్గాలు సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పక్కనే ఉన్న తెలంగాణలో 24 గంటలపాటు కరెంటు బుగ్గలు వెలుగుతుంటే.. తమ రాష్ట్రంలో 4 గంటలు కూడా గగనమైతున్నదని వాపోతున్నారు. కర్ణాటకలో ఐదు నెలలకే కాంగ్రెస్ ఇంత నిర్వాకం చేస్తే.. పొరపాటున తెలంగాణలో ఓటేస్తే పరిస్థితి ఏమిటని తెలంగాణవాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎండుతున్న పొలాలు.. రైతన్న దిగాలు

కాంగ్రెస్‌పాలనలో అన్నదాతలకు కష్టాలు పెరిగిపోయాయి. వ్యవసాయానికి సరిపడా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. ఆ హామీని నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైంది. గంటలకొద్దీ ఎడాపెడా విద్యుత్తు కోతలతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఫలితంగా వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇది తట్టుకోలేని రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. గడిచిన 18 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకొన్న అన్నదాతల సంఖ్య 1,219కి చేరినట్టు గణాంకాలు చెప్తున్నాయి. కోతలు లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కురుగోడు తాలూకా సింధిగేరి, బైలూరు, కగ్గల్, కల్లుకంభ, ముష్టగట్టి, కోళూరు బాదనహట్టి, వద్దట్టి తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు స్థానిక కురుగోడులోని గుల్బర్గా ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ (జెస్కాం)కార్యాలయం ముందు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కరెంటు కోతలను నిరసిస్తూ.. పావగడ తాలూకాలోనూ రైతు నేతలు స్థానిక జెస్కాం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహించారు. అయినప్పటికీ, ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోవట్లేదు.

నరకప్రాయంగా బెంగళూరు

'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా పిలిచే బెంగళూరును సమస్యలకు కేరాఫ్‌గా కాంగ్రెస్ మార్చేసింది. రోడ్డెక్కితే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యంతో ఊపిరిపోయే దుస్థితి, విద్యుత్తు కోతలతో సామాన్యుల వెతలు, తాగునీటికి తంటాలు, భద్రత కరువు, ఆకాశాన్నంటుతున్న లివింగ్ కాస్ట్ వెరసి బెంగళూరులో ఇక ఉండబోయేది లేదని ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు చెప్తున్నారు. నరకానికి చిరునామాగా బెంగళూరు మారిపోయిందంటూ దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ కమెడియన్ ట్రెవోర్ నోహ్, బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా వంటి ప్రముఖులు సైతం తమ అసహనాన్ని వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

అంతులేని అవినీతి

కర్ణాటకలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి అంతులేకుండా పోయింది. ప్రతి ప్రభుత్వ కాంట్రాక్టులో మంత్రులు, ఎమ్మెల్యేలకు 40 శాతం కమీషన్ ఇవ్వందే ఏ ఫైలూ కదలటం లేదని ఆ రాష్ట్ర సివిల్ కాంట్రాక్టర్ల సంఘం బాహాటంగానే విమర్శలు గుప్పించింది. వీళ్ల అవినీతి పీడనకు తట్టుకోలేక పలువురు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. అవినీతి బీజేపీ ప్రభుత్వం పోయిందని సంతోషపడేలోపే 'అంతకుమించి' అన్నట్టుగా కాంగ్రెస్‌హయాంలో మరింత అవినీతి పెరిగిపోయిందని తాజా ఘటనలు నిరూపిస్తున్నాయి. కాంగ్రెస్ నేత, కాంట్రాక్టర్ అంబికాపతి ఇంట్లో రూ. 42 కోట్ల అక్రమ సొమ్ము గురువారం బయటపడటం కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నది. తెలంగాణ ఎన్నికల్లో పంచడానికే ఈ అవినీతి సొమ్మును సిద్ధంచేశారని సమాచారం. నాడు '40 పర్సెంట్' అవినీతి ప్రకంపనలు సృష్టించగా, నేడు ఏకంగా '50' పర్సెంట్ కాంగ్రెస్ కమీషన్‌రాజ్' అంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌పైనే '50' పర్సెంట్' అంటూ ఇటీవల ఆరోపణలు రావటం రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనాతీరుకు అద్దం పడుతున్నది.

కర్ణాటకలో కాంగ్రెస్ ఐదు పథకాలు- వాటి పరిస్థితి

పథకం	వివరణ	ప్రస్తుత పరిస్థితి
గృహలక్ష్మి	ఇంటి మహిళా పెద్దకు నెలకు రూ.2000	మొదటి నెలకే చెల్లింపులు. అదీ కొందరికే
గృహజ్యోతి	200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు	ఛార్జీలు పెంచింది. విద్యుత్తు కోతలకు దిగింది.
యువనిధి	డిగ్రీపాసైన యువతకు నెలకు రూ.3000 భృతి	ఉద్యోగనోటిఫికేషన్లు ఇస్తామంటూ కాలయాపన
అన్నభాగ్య	ప్రతి వ్యక్తికి నెలకు 10 కిలోల ఉచిత బియ్యం	బియ్యానికి బదులు నగదు ఇస్తామని రూ. 9 చెల్లింపు
శక్తి	ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణం	బస్సు సర్వీసుల రద్దు. నిబంధనల్లో మార్పులు

దూరదర్శన్, రేడియోలో ఎన్నికల ప్రచారం

పార్టీలకు సమయం కేటాయింపు

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): జాతీయ, ప్రాంతీయ పార్టీలు దూరదర్శన్, ఆలిండియా రేడియోలో ఎన్నికల ప్రచారానికి ఈసీ సమయాన్ని వీలుకల్పించింది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని పార్టీలకు కలిపి దూరదర్శన్‌లో 898 నిమిషాలు, రేడియోలో 898 నిమిషాల చొప్పున సమయాన్ని కేటాయించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను ప్రాతపదికగా తీసుకుని అత్యధికంగా బీఆర్ఎస్‌కు 277 నిమిషాలు చొప్పున కేటాయించిన ఈసీ.. కాంగ్రెస్‌కు 185, బీజేపీకి 79 నిమిషాల చొప్పున కేటాయించింది. అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించిన నాటి నుంచి ప్రచారపర్వం ముగిసేవరకు పార్టీలు దీన్ని ఉపయోగించుకోవచ్చు. ముందుగా రికార్డ్ చేసిన ప్రసంగాలను దూరదర్శన్, రేడియో నిర్వాహకులకు అందించాలి. ఆ ప్రసంగాల రికార్డింగ్‌కు అయ్యే ఖర్చును రాజకీయ పార్టీలే భరించాల్సి ఉంటుంది.

ఎన్నికల ప్రచారానికి దూరదర్శన్, రేడియోలో కేటాయించిన సమయం

పార్టీ	టీవీ (నిమిషాల్లో)	రేడియో (నిమిషాల్లో)
బీఆర్ఎస్	277	277
కాంగ్రెస్	185	185
బీజేపీ	79	79
టీడీపీ	62	62
ఎంఐఎం	58	58
బీఎస్పీ	55	55
సీపీఎం	47	47
వైఎస్ఆర్‌సీపీ	45	45
ఆప్	45	45

ఐటీ ఓటర్లూ కీలకమే!

- హైదరాబాద్‌లో 10 లక్షల మంది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉద్యోగులు
- శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లో 20-30% టికీల నివాసం
- కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్ నియోజకవర్గాల్లోనూ గణనీయంగా ఉద్యోగుల సంఖ్య
- ఐటీ మంత్రి కేటీఆర్ పనితీరుపై సానుకూల దృక్పథం
- బీఆర్ఎస్ వైపే మొగ్గుతారని విశ్లేషకుల అంచనా

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగ ఉద్యోగులు నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారా? వారి ఓట్లు గెలుపు ఓటమిలను ప్రభావితం చేస్తాయా? ఇదే అంశం ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరగింది. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందినవారే కాకుండా ఇతర రాష్ట్రాలవారు కూడా హైదరాబాద్‌లో ఐటీ కొలువులు చేస్తున్నారు. ఇక్కడే ఓటుహక్కు నమోదు చేయించుకున్నారు. హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్ ప్రాంతం రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనే విస్తరించి ఉన్నది. మాదాపూర్ హైటెక్‌సిటీ, రాయదుర్గం, కొండాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, పుప్పాల్‌గూడ, కోకాపేట, మణికొండ, నార్సింగి, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ ప్రాంతాల్లో ఐటీ కంపెనీల కార్యాలయాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలన్నీ శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనే ఉండటం విశేషం. ఈ రెండు నియోజకవర్గాల పధిలో మొత్తం 10,69,771 మంది ఓటర్లు ఉండగా ఇందులో 20-30% మంది ఐటీ ఉద్యోగులు ఉంటారని అంచనా. ఐటీ కారిడార్‌లోని మొత్తం 10 లక్షల మంది ఐటీ ఉద్యోగుల్లో దాదాపు 3 లక్షల మంది శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో ఉంటే, మిగతా వారంతా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్ తదితర నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో ఐటీ ఉద్యోగుల ఓట్లు కీలకంగా మారతాయని భావిస్తున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్‌కు సానుకూలంగా మారుతుందని రాజకీయ విశ్లేషకుల అంచనా.

ఐటీ రంగంపై కేటీఆర్ ముద్ర

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంపై ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ తనదైన ముద్ర వేశారు. ఐటీశాఖ మంత్రిగా కేటీఆర్ తీసుకున్న నిర్ణయాలు, మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ స్థాయి కంపెనీలు కార్యాలయాలు నెలకొల్పడం వంటి పరిణామాలు దేశంలోనే హైదరాబాద్‌ను ఉన్నతస్థానంలో నిలబెట్టాయి. గత పదేండ్లలో హైదరాబాద్‌లో ఐటీరంగం ప్రగతి పరవళ్లు తొక్కింది. బెంగళూరు నగరాన్నీ వెనక్కి నెట్టింది. భవిష్యత్ ఐటీ రంగ విస్తరణకు సంబంధించిన కార్యాచరణపై ఈ రంగంలోని నిపుణులంతా కేటీఆర్ పనితీరు పట్ల సానుకూలంగా ఉన్నారు. ఐటీ రంగాన్ని నగరంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించడం, మెట్రో రైలును నగర నలుమూలలకు విస్తరించడం వంటి చర్యలు ఐటీ రంగం ఉజ్వల భవిష్యత్‌కు దోహదం చేస్తాయని భావిస్తున్నారు. ఇవన్నీ ఐటీ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం పట్ల మంచి అభిప్రాయాన్ని సృష్టించాయి.

ఎన్నికల ఫండింగ్‌కు ఏటీఎంగా కర్ణాటక

- తెలంగాణ ఎన్నికలకే42 కోట్లు
- అక్కడి కాంగ్రెస్ సర్కారుపై విపక్ష నేతల మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేత, కాంట్రాక్టర్ అంబికాపతి ఇంట్లో రూ.42 కోట్ల అక్రమ సొమ్ము బయటపడటం కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నది. తెలంగాణతోపాటు ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పంచడానికే ఈ అవినీతి సొమ్మును సిద్ధంచేశారని సిద్దరామయ్య సర్కారుపై ప్రతిపక్ష పార్టీ నేతలు విమర్శల జడివాన కురిపిస్తున్నారు. బీజేపీ నేత, మాజీమంత్రి సీఎన్ అశ్వత్ నారాయణ్ మాట్లాడుతూ.. రూ.42 కోట్ల డబ్బును కాంగ్రెస్ ఏజెంట్లు అక్రమంగా వసూలు చేశారని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫండింగ్‌కు కర్ణాటకను కాంగ్రెస్ ఓ ఏటీఎంగా మార్చివేసిందని మండిపడ్డారు. ఐదు గ్యారెంటీలను అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన హస్తంపార్టీ.. 4 నెలలు గడిచినా ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదని ధ్వజమెత్తారు.

తెలంగాణలో పంచేందుకే

తెలంగాణలో పంచేందుకే రూ. 42 కోట్ల అక్రమసొమ్మును కాంగ్రెస్ సిద్ధం చేసిందని మాజీ సీఎం, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. పార్టీకి అనుకూలమైన కాంట్రాక్టర్లకు రూ.650 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌హయాంలో అక్రమ లావాదేవీలు పెరిగిపోయాయని బీజేపీ నేత నళిన్ కుమార్ కటీల్ ఆరోపించారు. అవినీతి కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలో వేళ్లూనుకొని ఉందని కేంద్రమంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ ఆరోపించారు. 5రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బును పంచడానికి కాంగ్రెస్ కర్ణాటకను ఏటీఎంలా వాడుకుంటున్నదని ఆరోపించారు.

ఎంపీ అర్వింద్.. ఖబడ్దార్

మల్లాపూర్‌లో దళిత సంఘాల ఆందోళన

మల్లాపూర్, అక్టోబర్ 14: ఎంపీ అర్వింద్ మెట్‌పల్లిలో జరిగిన సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేయడంతోపాటు, ఎమ్మెల్యేపై అసభ్య పదజాలాన్ని ఉపయోగించడాన్ని నిరసిస్తూ శనివారం మల్లాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల్లో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే, ఆయన తనయుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ కల్వకుంట్లపై ఎంపీ అర్వింద్ ఇష్టానుసారంగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటీవల నియోజకవర్గంలో దళితబంధు ద్వారా వంద మందికిపైగా లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి దళితుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే కృషి చేశారని అన్నారు. దళితబంధు పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు అర్వింద్ అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.

ముగ్గురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

- ఉత్తర్వులు జారీ చేసినసీఎస్

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ ఐఏఎస్, ఐపీఎస్‌ల వరుస బదిలీలు జరుగుతున్నాయి. శనివారం ముగ్గురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియాకు సెర్ప్ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రతి ఓజాకు ఉమెన్, చిల్డ్రన్స్, డిజబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్స్ (డబ్ల్యూసీడీఅండ్ఎస్సీ) కమిషనర్‌గా, ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌కు ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ (హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండిక్రాఫ్ట్స్) కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 357 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

- ప్రతి నియోజకవర్గానికి మూడు ప్రత్యేక బృందాలు
- ఒక్కో బృందంలో మెజిస్ట్రేట్ స్థాయి అధికారి

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర పోలీసు శాఖ తీవ్ర కసరత్తు చేస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి మూడు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్టు తెలుస్తున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలకు 357 ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లు విధులు నిర్వర్తిస్తున్నాయి. ఈ ప్రత్యేక బృందాల్లో తప్పనిసరిగా మెజిస్ట్రేట్ స్థాయి అధికారి ఒకరు, నలుగురు పోలీసు సిబ్బంది, అవసరమైతే కెమెరామెన్/వెబ్‌క్యామ్ సామగ్రి, ప్రత్యేక వాహనం ఉంటాయి. ఎన్నికల అధికారులు, పోలీసులకు వచ్చే సమాచారం, సీ-విజిల్ యాప్ ద్వారా పౌరులు చేసే ఫిర్యాదుల ఆధారంగా వీరి కార్యాచరణ ఉంటుంది. ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీల నాయకులు పెట్టే ప్రలోభాలు, ఇచ్చే బహుమతులు, పంచే డబ్బులు, మద్యం వంటి వాటిపై కూడా ఈ ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు దృష్టిసారిస్తాయి. తమ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు, ఎన్నికల ఏర్పాట్లు, ప్రక్రియను వీరు పరిశీలిస్తారు. అవసరమైతే స్థానిక అధికారులకు సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇస్తారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ల విధి నిర్వహణ ఎప్పటికప్పుడు కెమెరాలో రికార్డు అవుతుంది.

ఈసీ విస్తృత తనిఖీలు

- 75 కోట్ల నగదు, మద్యం పట్టివేత
- తనిఖీలతో బెంబేలెత్తుతున్న సాధారణ పౌరులు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నర్సింగాపూర్ వద్ద శనివారం రాత్రి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): అసె